# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 15

**నరేంద్ర గజపతి** సైన్యం ముద్గల్ గ్రామాన్ని ప్రవేశించింది. ఊరి చివర సైనిక గుడారాలు వేసుకొని రాత్రికి అక్కడే ఉండమని ఆదేశించాడు. కొంతమంది అధికారుల్నీ, పదిమంది సైన్యాన్నీ తీసుకొని వేదరాయశర్మ ఇంటికి వెళదామని చెప్పాడు. ఏర్పాట్లు జరిగాయి.

అప్పటికింకా వెలుతురుంది. వెళుతూనే సరాసరి వేదరాయశర్మ ఇంటి ముందు ఆగాడు. లోపలకి ఒక సైనికాధికారిని పంపించి నేహల ఇల్లెక్కడో కనుక్కోమన్నాడు. వేదరాయశర్మ భార్య ఇంట్లో లేదు. గుడికి వెళ్ళిందని అక్కడున్న ఒక శిష్యుడు చెప్పాడు. అతన్నే నేహల ఇల్లెక్కడా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడనుండి నేహల ఇంటి ముందు ఆగారు.

లోపలకి సైనికాధికారొకతను వెళ్ళాడు. వీధి తలుపులు బార్లా తీసే ఉన్నాయి. ఎవరైనా ఉన్నారా అంటూ పిలిచాడు. ఎవరూ పలకపోయేసరికి మెల్లగా తలుపు తెరుచుకొని లోపలికి ప్రవేశించాడు. అక్కడెవరూ ఉన్న అలికిడే లేదు. గట్టిగా పిలిచాడు. ఎక్కడా మాటే వినిపించకపోయేసరికి ఇల్లంతా గాలించాడు. మనిషి జాడే లేదు. పెరట్లోకి వెళ్ళి చూసాడు. అక్కడా ఎవరూ కంపించకపోయేసరికి గబగబా పరిగెత్తుకుంటూ బయటకొచ్చి, ఇంట్లో ఎవరూ లేరన్న సంగతి నరేంద్ర గజపతికి చెప్పాడు. అది విని నరేంద్రగజపతికి చివ్వున కోపం వచ్చింది. సైన్యం వస్తుందన్న సంగతి తెలిసి పారిపోయారాన్న అనుమానం వచ్చింది.

ఓ క్షణం ఆలోచించాడు. తమ రాక ముందే తెలిసి వూరు విడిచి వెళ్ళారా? తెలిసే అవకాశమే లేదు. వేదరాయశర్మ భార్య కూడా ఇంట్లో లేదంటే సైన్యం వస్తోందన్న వార్త ముందుగానే తెలుసుండాలి. వేదరాయశర్మ భార్య కూడా ఇంట్లో లేదంటే ఇందులో ఏదో తిరకాసుంది. విషయం తెలిసి ముందే వేదరాయశర్మ వీళ్ళకి కబురంపాడా? పరి పరివిధాల ఆలోచించాడు.

ఇహ ఊరంతా గాలించాలి. చీకటి పడితే కష్టం. రేపటి వరకూ గాలి. ఈలోగా సైన్యం వచ్చిన విషయం గుప్పుమంటే రాత్రికి రాత్రి పారిపోవచ్చు. కాబట్టి వేంటనే వెతకాలి. అక్కడే ఉన్న సైన్యాధికారిని దగ్గరకు రమ్మనమైని సైగ చేసాడు.

"మీరు తక్షణమే ఊరంతా వెతకండి. ప్రతీ ఇల్లూ సోదా చెయ్యండి. ఎవరిమీద అనుమానమొచ్చినా వదలద్దు. హింసించైనా వివరాలు తెలుసుకోండి. ఆ అమ్మాయి వాళ్ళు పారిపోయుండచ్చు. తెల్లారితే వెతకడం మరింత కష్టం. రాత్రికి రాత్రి పారిపోయే అవకాశముంది. ఊరంతా చుట్టుముట్టండి. అవసరమయితే ప్రజల్ని భయ భ్రాంతుల్ని చేసయినా అమ్మాయెక్కడున్నదీ రాబట్టండి. మనం ఉట్టి చేతులతో వెళితే మహారాజు మనల్ని క్షమించరు. వెళ్ళండి.!" అంటూ ఆదేశించాడు.

అతను "చిత్తం, మీ ఆజ్ఞ!" అంటూ ముందుకు కదిలాడు.

నేహల ఇల్లు మరోసారి వెతికమని సైనికులని ఆజ్ఞాపించాడు. వాళ్ళు ఇంట్లోకి ప్రవేశించి ప్రతీ చోటా వెతకడం మొదలు పెట్టారు. ప్రతీ మూలా గాలించారు. భోషాణమూ, గాదె, ఇలా ప్రతీదీ వెతికారు. అటకమీదుండచ్చని అక్కడా వెతికారు. ఈ వెతకడంలో కనిపించిన ప్రతీ వస్తువూ చెల్లా చెదురు చేసారు. ఎక్కడా మనిషి జాడే కనిపించలేదు వాళ్ళకి. కొంతసేపయ్యాక అదే విషయం నరేంద్రగజపతికి విన్న వించారు.

అది విని నరేంద్రగజపతికి ఆక్రోశం పెరిగింది. ఎలాగయినా వెతికి పట్టుకోవాలన్న ఉక్రోషం పెరిగింది.

ఊరంతా గాలించమని కోపంగా గట్టిగా అరిచాడు.

అప్పటికి సాయంత్రమయ్యి చీకటి పడటం మొదలయ్యింది

0000000000

ఇక్కడ - శంభుడూ, హరీంద్రా, అతని భార్యా, మసూం అశ్వత్థనారాయణ కోవెల వెనుకే ఉన్నారు. శంభుడూ, మసూం హుటాహుటిన గుర్రం తీసుకురావడానికి వెళ్ళారు. శంభుడికి గుర్రాలు ఎక్కడ బాడుక్కి ఇస్తారో తెలుసు. వెళ్ళి గుర్రాన్ని తెచ్చారు.

మసూమ్ని కోవెలకి దూరంగా ఉండమని చెప్పి, శంభుడొక్కడే హరీంద్రా వాళ్ళు ఉన్న చోటుకి వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. హరీంద్రా, అతని భార్యా భయంతో కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు. ఏం జరుగుతూందో అర్థం కావడం లేదు. ఏం చెయ్యాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

"త్వరగా రండి. సైన్యం మీ ఇంటి వైపుగా వెళ్ళిందని తెలిసింది. కోవెల వెనుక ప్రహరీ గోడ దగ్గర మసూం ఉన్నాడు. అతను మిమ్మల్ని లింగసుగూరు తీసుకెళతాడు. జాగ్రత్త, మీరు దారిలో ఎక్కడా గద్దు. ఎవరికంటా పడకుండా జాగ్రత్తగా వెళ్ళండి.!" అంటూ గబగబా చెప్పాడు.

హుటాహుటిన కోవెల వెనుకకి వెళ్ళి మసూం ఉన్నచోటుకి వచ్చారు. క్షణం ఆలస్యం చెయ్యకుండా హరీంద్రా, అతని భార్యా గుర్రం ఎక్కారు. గట్టిగా పట్టుకోమని జాగ్రత్త చెప్పి మసూం కదిలాడు.

చీకట్లో గుర్రం దుమ్ము రేపుకుంటూ ఉత్తరదిశగా వెళ్ళింది. శంభుడు ఇంటికి బయల్దేరాడు.

000000000000000

నరేంద్రగజపతి సైన్యం ప్రతీ ఇల్లూ గాలించారు. కనిపించిన ప్రతీ వస్తువూ చెల్లా చెదురుగా విసిరేసారు. అడ్డొచ్చిన వారిని పక్కకు నెట్టేసారు.

ఏం జరుగుతూందో ప్రజలకి అర్థం కాలేదు. రాయచూరునుండి యుద్ధానికెవరయినా వచ్చారా? ఏమయ్యింది? హఠాత్తుగా మీదపడిన భీభత్సానికి కారణం తెలియలేదు. పిల్లలూ, స్త్రీలూ భయంతో బిక్క చచ్చిపోయారు.

అశ్వత్థ నారాయణ ఆలయంలో నేహలుండచ్చని ఎవరో అంటే అటుగా వెళ్ళారు.

అక్కడున్న ప్రజల్నుద్దేశించి నరేంద్రగజపతి గట్టిగా హెచ్చరించాడు.

"మీలో ఎవరైనా నేహల కానీ, ఆ అమ్మాయి అమ్మా, నాన్నని కానీ చూస్తే తక్షణమే మాకు పట్టికొచ్చి అప్పగించండి. ఇది మహారాజు ఆజ్ఞ!"

నేహల కోసం మహారాజు సైన్యం పంపాడని అందరూ చెవులు కొరుక్కున్నారు. కొంతమంది భయంతో వణికిపోయారు. అంతమంది సైన్యాన్ని చూడ్డం ముగలువాసులకి అదే ప్రథమం. ముద్గల్ గ్రామం ఎంతో ప్రశాంతంగా ఉండేది. ఈశాన్యాన్న ఉన్న రాయచూరు వద్ద ఉద్రిక్తతలున్నా, ఎప్పుడూ సైన్యం ఇటుగా వచ్చినట్లు లేదు. రాయచూరు దగ్గర సైన్యం వస్తుందని వినడమే కానీ ఎప్పుడూ చూళ్ళేదు. హఠాత్తుగా ఇంతమంది సైన్యం ఇలా ఊరంతా భీభత్సం చేస్తూంటే చూసి హుతాశులయ్యారు. స్త్రీలూ, పిల్లలూ భయంతో వణికిపోయారు.

ప్రాణాలు అరచేత పెట్టుకొని భయంతో గజగజలాడారు. ఎవరికీ నోట మాట లేదు.

రాత్రికి రాత్రి ప్రతీ ఇల్లూ సోదా చేసినా ఎక్కడా నేహల కుటుంబీకుల జాడే తెలీలేదు నరేంద్ర గజపతికి.

ఉక్రోషం పెరిగింది. సైన్యాన్ని భీభత్సం చేసయినా గాలించమని మరోసారి ఆదేశించాడు. అదే అదనుగా సైనికులు ప్రజల మీద విరుచుకుపడ్డారు. అవసరమున్నా లేకపోయినా కనిపించిన ప్రతీ ఒక్కర్నీ హింసించడం మొదలుపెట్టారు. ముద్గల్ గ్రామం ప్రజల - ఆక్రందనలతో హోరెత్తింది.

వారి గోడు వినే నాధుడే కనిపించలేదు. ఎవర్నీ ఉన్న చోటునుండి కదలొద్దని ఆదేశించాడు నరేంద్రగజపతి.

ఊరంతా గాలమేసినా నేహల కుటుంబం జాడ తెలీలేదు.

ఆ రాత్రి ముద్గల్ గ్రామాన్ని భయం వరించుకుంది.

00000000000000000

అప్పటికే నేహలా, రేవన్నా లింగసుగూరు చేరుకున్నారు.

నేహలా వాళ్ళ అత్తయ్యింటికి వెళ్ళారు. రాత్రి పూట పరాయి వ్యక్తితో నేహల రావడం చూసి ఆశ్చర్యపోయారు నేహల అత్తా, మామా! మేనకోడలు ఎప్పుడూ గుమ్మం దాటిన వైనమే తెలీదు వాళ్ళకి. ఎప్పుడొచ్చినా తల్లి తండ్రులతోనే వచ్చేది. అలాంటిది చెప్పా పెట్టకుండా, ఏ కబురూ లేకుండా రావడం వాళ్ళకి ఆశ్చర్యం కలిగించింది. జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించారు నేహలా, రేవన్నా!

వాళ్ళు ఊరువిడిచినట్లు ఎవరికీ తెలీదనీ, హరీంద్రా, భార్యా ఈ రాత్రికి వచ్చే అవకాశముందనీ రేవన్న చెప్పాడు.

తల్లి తండ్రుల పేరు చెప్పగానే అంతవరకూ ఆపుకున్న దుఃఖం ఒక్కసారి పెల్లుబికి వచ్చింది నేహలకి.

ఏడుస్తున్న నేహలని వాళ్ళు సముదాయించారు.

ఓ రాత్రివేళ హరీంద్రా, భార్యా, మసూం వచ్చారు. వాళ్ళని చూడగానే ప్రాణం లేచొచ్చింది నేహలకి. నేహలని దగ్గరకు తీసుకొని ఏడవడం ప్రారంభించింది ఆమె తల్లి. నేహలకీ తల్లి తండ్రులని చూసాక మనసు కాస్త కుదుటపడింది. వాళ్ళని చూడగానే అంతవరకూ ఉన్న భయం కాస్తా పోయింది.

కూతుర్ని చూడగానే  తల్లి తండ్రులూ ఒక్క సారి కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు. తమ దురదృష్టానికి విచారించారు.

"బాధపడకండి. ఇందులో మన ప్రమేయం ఏమీ లేదు. మహారాజు ఇలా సైన్యాన్ని పంపుతాడని ఎవరూహించారు? దిగులు పడద్దు. మనం తెల్లారగానే రాయచూరు వెళ్ళాలి. ఇక్కడుండడం కూడా క్షేమం కాదు. ఎవరికైనా తెలిసి చూకీ ఇస్తే మన ప్రాణాలకే ముప్పు. రాయచూరయితే మహారాజు సైన్యం వచ్చే అవకాశాలు తక్కువ. ప్రస్తుతం మనకి ఇంతకన్నా దారి లేదు." అని రేవన్న ఏం చెయ్యాలో చెప్పాడు.

"రేవన్న చెప్పిందీ సబబుగానే తోస్తోంది. రాయచూరు వైపు సైన్యం రావడానికి సంకోచిస్తారు. గుల్బర్గా సుల్తానులతో మొన్ననే యుద్ధం జరిగింది కూడా.  యుద్ధ విరమణ సమయంలో రాయచూరు వద్ద

సైన్యాన్ని పంపకూడదన్న ఒప్పందం ఉంది. గుల్బర్గా సుల్తానులూ, విజయనగర రాజులూ రాయచూరు వివాద స్థలంగా గుర్తించారు. వారి సైన్యాలు ఎట్టి పరిస్థితుల్లో ఆ వూరికి రావు. రాయచూర్లో నాకు తెలుసున్న ఒక ఆలయ పూజారి ఉన్నాడు. అతని ఇంట మిమ్మల్ని చేరుస్తాను. ఎవరికీ మీరక్కడున్నారన్న అనుమానం రాదు." మసూం కూడా రేవన్న చెప్పినదాన్ని సమర్ధించాడు.

సూర్యోదయం కాగానే రాయచూరు వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు.

శరీరమూ, మనసూ ఎంత అలసినా ఆ రాత్రి ఎవరికీ నిద్రలేదు.

ఎంతో దుర్భరంగా గడిచిందా రాత్రి.

అక్కడ ముద్గల్ వాసులదీ అదే పరిస్థితి.

00000000000000

తెల్లారింది. చీకటిలో గుర్తించలేదు కానీ, ముద్గల్ గ్రామంలో ప్రతీ ఇల్లూ చిన్న భిన్నమయ్యాయి. సైన్యం చేసిన భీభత్సానికీ, దాడికీ సాక్షిగా ప్రతీ ఇల్లూ చిందర వందరయ్యాయి. వేదరాయశర్మ భార్యకి విషయం తెలిసింది. ఉదయం లేస్తూనే శంభుడు వేదరాయశర్మ ఇంటివైపుగా వెళ్ళాడు. పొద్దెక్కాక సైన్యం రాక మునుపే గురువుగారి భార్యకి జరిగినది చెప్పాలనుకున్నాడు.

అంత పొద్దున్నే శంబుడి రాకని చూసి కంగారు పడింది వేదరాయశర్మ భార్య. భర్తకి ఏం జరిగిందాని ఆత్రంగా అడిగింది. శంభుడు జరిగినదంగా పూస గుచ్చినట్లు చెప్పాడు. దీనికంతటికీ కారణం నేహాల మూర్ఖత్వమే నన్న అభిప్రాయానికొచ్చింది ఆమె.

"ఎంత చెప్పు. నేహాల మొండితనమే వీటన్నింటికీ కారణం. మహారాజు పెళ్ళి చేసుకుంటానంటే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. ఇదెక్కడి గోలో తెలీదు. చూడు - తనవల్ల ముద్గల్ గ్రామానికే ముప్పొచ్చింది. మీ గురువుగారికీ ఎంత అప్రదిష్టా? ఇన్నాళ్ళూ నేహాలంటే ఎంతో మంచి పిల్లా, సంస్కారి అన్న గౌరవం ఉండేది. పరమ మూర్ఖురాలని ఇప్పుడే తెలుస్తోంది. కోరి కోరి ఎవరైనా ప్రాణాలమీదకి తెచ్చుకుంటారా? ఛీ! ఛీ!" అంటూ విసుక్కుంది.

"ఇందులో నేహాల తప్పేమీలేదండీ! ఒకరకంగా చెప్పాలంటే గురువుగారూ, నేనూ ఇందుకు కారణం. గురువుగారు నేహాల నాట్య ప్రతిభ చూసి ఎలాగయినా మహారాజు ముందు ప్రదర్శించాలనుకోడంతోనే ఇదంతా మొదలయ్యింది. నేహాలకిష్టం లేదన్న సంగతి తెలిసికూడా మహారాజు వద్ద ప్రస్తావించకుండా ఉండుండాల్సింది. నేహాలకి మంచి చేద్దామన్న ఉద్దేశ్యంలో దానిచుట్టూ అల్లుకున్న విపత్తుని గుర్తించలేకపోయారు గురువుగారు. మహారాజులతో వ్యవహారం ప్రాణాలతో చెలగాటం అన్నది గ్రహించలేకపోయారు. నన్ను అవమానించిందన్న చిన్న కారణం వెతుక్కుని నేనూ అనవసరంగా తొందరపడ్డాను. ఆమె చిత్ర పటం గీసి మహారాజుకి చూపించకపోతే నేహాలని పెళ్ళాడాలన్న ఆలోచనే వచ్చేది కాదు. నిజానికిందులో నేహాల ప్రమేయం చాలా తక్కువ. మా అందరి అనాలోచిత నిర్ణయాలకీ ఈ గ్రామం మూల్యం చెల్లిస్తోంది.  వచ్చినతను మహారాణి ఉమాదేవి తమ్ముడు. సైన్యాన్ని తీసుకెళుతున్నాడని తెలిసి నేనే గురువుగారికి చెప్పి బయల్దేరాను.!" అని నేహాలని కలిసిన ఉదంతమంతా వివరించాడు.

"అమ్మా! ఎవరడిగినా మీరు ఈ విషయాలేమీ దయ చేసి చెప్పద్దు. నేను వీలు చూసుకొని విజయనగరం వెళ్ళి గురువుగారిని తీసుకుని వస్తాను. ఈ భీభత్సం కాస్త సద్దు మణిగే దాకా కాస్త ఓపిక పట్టాలి. తప్పదు." అంటూ గురువుగారి భార్యని అర్థించాడు.

ఆమె అలాగే నన్నట్లు తలూపింది.

ఇంతలో ఇంటిముందు గుర్రపు డెక్కల చప్పుడు వినిపిస్తే ఇద్దరూ వీధి గుమ్మం వైపుగా వచ్చారు.

బయట కొంతమంది సైనికులూ, వారి వెనుకే చిన్న రథంపై నరేంద్ర గజపతీ కనిపించారు.

నరేంద్ర గజపతి రథం దిగి లోపలికొచాడు. ఆతని వెనుకే మరికొంతమంది అధికారులూ వచారు.

వాళ్ళని చూడగానే వేదరాయశర్మ భార్య కాస్త భయపడింది. ఆమె పక్కనే శంభుడూ ఏమయ్యిందాని విస్తుబోయి చూస్తున్నాడు.

"అమ్మా! మీకు విషయం తెలిసే ఉంటుంది. నేహాల్ని పట్టి బంధించి తీసుకురమ్మనమని మహారాజు ఆజ్ఞ

వేదరాయశర్మ గారి అనుజ్ఞతో ఈ ఊరొచ్చాం. మేం వస్తున్న సంగతి తెలిసి ఆమె పారిపోయింది. రాజ్యమంతా గాలించయినా పట్టుకు తీరుతాం. మీ కంటబడితే మా వద్దకు తీసుకు రండి. లేదంటే ఎవరి ప్రాణాలకీ హామీ లేదు. మహారాజుకి ఆగ్రహం వస్తే ఎవర్నీ క్షమించరు.!" అంటూ చెప్పాడు.

వేదరాయశర్మ భార్య నోట మాట లేదు. అలాగే నన్నట్లు తలూపింది.

వెళుతూ వెళుతూ ఆమె పక్కనే ఉన్న శంభుణ్ణి చూసి ఎక్కడో చూసినట్లుగా అనిపించింది. ఎక్కడ చూసానన్నది గుర్తు రాలేదు నరేంద్రగజపతికి.

మరలా వెనక్కి వచ్చి పరికించి అతని మొహం వైపుగా చూసాడు.

"నిన్నెక్కడో చూసినట్లుగా ఉందే?" అంటూ గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేసాడు.

శంభుడికి భయం వేసింది. తనని నరేంద్ర గజపతి గుర్తిస్తే ప్రమాదమన్న సంగతి అర్థమయ్యింది. తలదించుకునే ఏమీ సమాధానం చెప్పకుండా అక్కడ నుంచున్నాడు.

"నువ్వు! వేదరాయ శర్మ గారి శిష్యుడివి కదూ? విజయనగరంలో చూసిన గుర్తు. అక్కడుండాల్సిన నువ్వు ఇక్కడికెప్పుడొచ్చావు?" అనుమానంగా అడిగాడు.

శంభుడికి పొంచి వున్న ప్రమాదం అర్థమయ్యింది. నరేంద్ర గజపతి తనని గుర్తిస్తే కష్టమే! మరుమాట్లాడ లేదు.

"సమాధానం చెప్పవే!" అంటూ హుంకరించాడు నరేంద్రగజపతి.

తన తల్లి తండ్రులకి అనారోగ్యమని తెలిస్తే నాలుగు దినాల క్రితం వచ్చానని అబద్ధం చెప్పాడు. అంతకంటే అతనికి గత్యంతరం లేదు.

"నేను బయల్దేరే ముందే నిన్ను చూసానే! నాలుగు దినాల క్రితం వచావా? ఇక్కడికి మేము రావడానికే రెండునాళ్ళు పట్టింది. అలాంటిది నాలుగు నాళ్ళ క్రితం వచ్చావా? నువ్వేదో అబద్ధం చెబుతున్నావు." అంటూ అనుమానించాడు.

శంభుణ్ణి బంధించమని పక్కనే ఉన్న సైనికాధికారికి చెప్పాడు.

ఇది చూసి కంగారు పడిందింది వేదరాయశర్మ భార్య. శంభుడూ భయపడ్డాడు.

"లేదు! ఆ అబ్బాయి కంగారులో నాలుగు దినాలన్నాడు. నిన్న రాత్రే వచ్చాడు. గురువు గారు పంపిస్తే వచ్చవు కదురా? చెప్పవేం?" అంటూ శంభుణ్ణి గదమాయిస్తున్నట్లుగా అంది.

ఇది విని నరేంద్రగజపతి అనుమానం మరింత పెరిగింది.

శంభుణ్ణి బంధించి తన స్థావరానికి తీసుకెళ్ళమని ఆదేశించాడు.

సైనికులు అతని చేతుల్ని వెనక్కి తిప్పి తాళ్ళతో బంధించి తీసుకెళ్ళారు.

నరేంద్రగజపతిని వేదరాయశర్మ భార్య ఎంత బ్రతిమాలినా ప్రయోజనం లేకపోయింది. అతన్ని వదలమని కాళ్ళు పట్టుకుంది. ఆమెను తోసుకుంటూ ముందుకు కదిలాడు నరేంద్ర గజపతి.

అతనికి దయా దాక్షిణ్యాలు లేవు. అతనొచ్చిన ధ్యేయమే వేరు.

ఎంత భీభత్సం సృష్టించయినా నేహల్ని మట్టు పెట్టడమే అతని లక్ష్యం.

000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

**POST YOUR COMMENTS**

